క్లుప్తంగా

విలువలతో కూడిన విద్య అందించాలి

కొత్తగూడెంఅర్బన్: ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థలు విద్యార్థులకు విలువలతో కూడిన విద్య అందించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పట్టణంలోని న్యూ గొల్లగూడెం కిడ్స్ పార్క్ పాఠశాలలో గురువారం ఎనిమిదో తరగతి క్లాసులను కూనంనేని ప్రారంభించి మాట్లాడారు. ప్రైవేటు విద్య సంస్థలు వ్యాపార దృక్పథంతో కాకుండా సామాజిక సేవాతో విద్యా సంస్థలను కొనసాగించాలని సూచించారు. ఎస్కే సాబీర్ పాషా, మాచర్ల శ్రీనివాస్, బోయిన విజయ్‌కుమార్, యూసుఫ్, ధర్మరాజు, సత్యనారాయణ చారి, దుర్గ, నేరెళ్ల రమేష్ పాల్గొన్నారు.

గ్రామసభలను సద్వినియోగం చేసుకోండి..

పాల్వంచరూరల్: గిరిజనుల సంక్షేమ కోసం నిర్వహిస్తున్న ధర్తి ఆబా జన్ భగీధరి అభియాన్ గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి కోరారు. రంగాపురం గ్రామంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఆధార్ కార్డు, ఆయుష్మాన్ భారత్, జనధన్ అకౌంట్, కుల ధృవీకరణ పత్రం, ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు, కిసాన్ సమృద్ధి యోజన కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సీడీపీఓ లక్ష్మీప్రసన్న, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీనిజ, ఏపీఓ రంగా, ఏపీఎం రాంబాబు పాల్గొన్నారు.

ఏజెన్సీ చట్టాలను అమలు చేయాలి

కొత్తగూడెంఅర్బన్: ఏజెన్సీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని కోరుతూ సేవాలాల్ బంజారా సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లావుడ్యా ప్రసాద్ నాయక్, న్యూఢిల్లీ లోక్ నాయక్ భవన కార్యాలయంలో జాతీయ ఎస్టీ ట్రైబల్ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేసినట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కంపోస్టు గుంతలు ఏర్పాటు చేయాలి

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం వారు ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 100 రోజుల ప్రణాళికలో భాగంగా గురువారం కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ శానిటేషన సిబ్బంది మేదరబస్తీలోని ప్రభుత్వ పాఠశాలలో, సుజాత నగర్ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కంపోస్టు గుంతలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ హైమద్ మాట్లాడుతూ.. రోజు వారిగా ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా కంపోస్టు గుంతలో వేస్తే అవి కుళ్లి ఎరువుగా తయారవుతుందని చెప్పారు. తరువాత దానిని మొక్కలకు/పంటలకు ఎరువుగా వాడవచ్చని తెలిపారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్, జవాన్లు, మెప్మా రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

నోట్ బుక్స్ పంపిణీ

ఇల్లెందురూరల్: మండలంలోని 85 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు ప్రభుత్వం నోట్‌బుక్స్ సరఫరా చేసింది. ఇప్పటి వరకు నోట్‌బుక్స్‌ను ఐటీసీ ద్వారా సరఫరా జరిగేవి. కానీ తొలిసారిగా నేరుగా ప్రభుత్వమే నోట్‌బుక్స్ సైతం పంపిణీ చేసింది. గురువారం మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు నోట్‌బుక్స్‌ను విద్యాశాఖ సిబ్బంది అందజేశారు.

టేకులపల్లి: మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు ప్రభుత్వం సరఫరా చేసిన ఉచిత నోట్ పుస్తకాలను టేకులపల్లి ఎంఈఓ కార్యాలయంలో గురువారం పంపిణీ చేశారు. మొదటి విడతగా మండలానికి వచ్చిన 1680 నోట్ పుస్తకాలను ఎంఈఓ అజ్మీర జగన్ నాయక్ ఆయా పాఠశాలల హెచ్‌ఎంకు అందజేశారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

ఇల్లెందురూరల్: మావోయిస్టులపై కేంద్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న మారణహోమాన్ని వెంటనే నిలిపివేయాలని, ఇప్పటి వరకు జరిగిన ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు జడ్జి చేత న్యాయ విచారణ జరిపించాలని న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలని కోరారు.

క్షయ వ్యాధి నిర్మూలనకు సహకరించండి..

ఇల్లెందురూరల్: క్షయ వ్యాధిపై ప్రతీఒక్కరు అవగాహన పెంచుకొని నిర్మూలనకు సహకరించాలని కొమరారం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ లోహిత అన్నారు. బొంబాయితండా గ్రామంలో గురువారం క్షయ ముక్తభారత్ క్యాంపు నిర్వహించారు. మాట్లాడుతూ.. రెండు వారాలపాటు దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం క్షయ వ్యాధి లక్షణాన్నారు. అనుమానం కలిగిన వారు వెంటనే పీహెచ్‌సీలో పరీక్షలు చేయించుకొని మందులు వాడాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ జరిగితే నిక్షయ పోషణ యోజన పథకం ద్వారా నెలకు రూ.వెయ్యి చొప్పున అందిస్తున్నామని చెప్పారు. నోడల్ ఆఫీసర్ సమ్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

‘సౌధా’ నియామకాలు నిలిపివేయాలి

- వీకే–7ఓసీ ఓబీలో పాతవారినే తీసుకోవాలి
- నాలుగేళ్లుగా ఉద్యోగాలు లేక 600 కుటుంబాలు విలవిల
- ఉపాధి కల్పించాలని వేడుకోలు


డీజీఎం పర్సనల్ మోహన్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు (ఫైల్)

సింగరేణి(కొత్తగూడెం): ఉద్యోగాల పేరుతో సౌధా కంపెనీ నిర్వహిస్తున్న నియామకాల ప్రక్రియను నిలిపివేయాలని, వీకే–7 ఓసీ ఓబీలో పాతవారితోనే ఉద్యోగాలు చేయించి వారికి ఉపాధి కల్పించాలని సింగరేణి కాంట్రాక్ట్ జేఏసీ నాయకులు కోరుతున్నారు. ఈ మేరకు సౌధా కంపెనీ నిర్వాహకులకు, సింగరేణి అధికారులకు జేఏసీ నాయకులు వినతిపత్రం అందజేశారు. కొత్తగూడెం ఏరియా పరిధి గౌతంఖని ఓపెన్‌కాస్ట్ గనిలో 1992 నుంచి 2022 వరకు ఓపెన్‌కాస్ట్ గనిలో సుమారు 50 మిలియన్ టన్నుల బొగ్గును వెలికితీశారు. అనంతరం బొగ్గు నిక్షేపాలు నిండుకున్నాయని, ఓవర్ బర్డెన్ (ఓబీ) పనులు నిలిపివేశారు. ఆ సమయంలో భవిష్యత్‌లో గౌతంఖని ఓపెన్‌కాస్ట్ ఎక్స్‌టెన్షన్ వచ్చినా.. లేక వీకే–7ఓసీ పనులు ప్రారంభించినా ఓసీలో గౌతంఖని ఓపెన్ కాస్ట్ గనిలో పనిచేసిన పాత వారికి అవకాశం ఇచ్చిన తరువాతే కొత్త వారికి ఉద్యోగాలు అవకాశం కల్పిస్తామని ఆనాటి అధికారులు భరోసా ఇచ్చారు. ఆ ప్రకారం పాతవారు 600 మంది కాంట్రాక్ట్ కార్మికులు ఉన్నారని వారికి అవకాశం కల్పించాలని జేఏసీ నాయకులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా, జీకే ఓసీ నూతన టెండర్ పొందిన సౌధా కంపెనీ నిర్వాహకులు సింగరేణి ఓబీకి డ్రైవర్లు, ఆపరేటర్లు, హెల్పర్లు, సూపర్‌వైజర్లు కావాలని, ఉద్యోగాల పేరుతో ప్రకటన ఇచ్చారు. సింగరేణి సంస్థకు చెందిన ఓసీలలో ఓవర్ బర్డెన్ (ఓబీ) ఏ నియామకం చేపట్టాలన్నా సింగరేణి యాజమాన్యం చేపట్టాలని, సౌధా కంపెనీ నిర్వాహకులు నియామకాలు చేపట్టటం సరికాదని జేఏసీ నాయకులు కోరుతున్నారు. తాజాగా మీరు అభ్యర్థుల నుంచి బయోడేటాలు స్వీకరించి పనులు చేపడితే ప్రస్తుతం ఖాళీగా ఉంటున్న సుమారు 600 కాంట్రాక్ట్ కార్మికులు వీధిన పడే ప్రమాదం ఉందని, సింగరేణిలో ఓసీలు వస్తే తమకు పని దొరుకుతుందని నాలుగేళ్లుగా నమ్మకంగా ఉన్నారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయరాదని కోరుతున్నారు.

నియామకాలు చేపట్ట వద్దు..



ఉద్యోగాల పేరుతో సౌధా కంపెనీ నిర్వహిస్తున్న ఉద్యోగ నియామకాల ప్రక్రియను నిలిపివేయాలి. వీకే–7 ఓసీలో పాత వారితోనే ఉద్యోగాలు చేయించి వారికి ఉపాధి కల్పించాలి. గతంలో అధికారుల ఇచ్చిన మాట ప్రకారం ఉద్యోగాలను భర్తీ చేయాలి.

– నెమ్మిళ్ల సంజీవ్, కాంట్రాక్ట్ జేఏసీ నాయకుడు

హామీలను నిలబెట్టుకోవాలి..



వీకే–7ఓసీ పనులు ప్రారంభించినా ఓసీలో గౌతంఖని ఓపెన్ కాస్ట్ గనిలో పనిచేసిన పాత వారికి అవకాశం కల్పిస్తామని ఆనాడు అధికారులు చెప్పారు. ఆ ప్రకారం పాతవారికి అవకాశం ఇచ్చిన తరువాతే కొత్తవారికి అవకాశం కల్పించాలి.

– గౌని నాగేశ్వరరావు, ఇఫ్టూ నాయకుడు

నిబంధనలు పాటించాలి..



కంపెనీ నిబంధనల మేరకు 80 శాతం లోకల్, 20 శాతం నాన్ లోకల్ వారిని తీసుకుంటారు. కాకపోతే సౌధా కంపెనీ వారు నేరుగా తీసుకోవటం సరికాదు. ఏదైనా కంపెనీ నియమ నిబంధనల ప్రకారం రిక్రూట్‌మెంట్ జరపాలి.

– శ్రీరమేష్, వీకే ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్

సమ్మెను విజయవంతం చేయండి..

సింగరేణి(కొత్తగూడెం): జూలై 9న దేశవ్యాప్తంగా జరగనున్న అఖిల భారత సమ్మెను విజయవంతం చేయాలని హెచ్‌ఎంఎస్ ప్రధాన కార్యాదర్శి రియాజ్ అహ్మద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అంశంపై సింగరేణి జాతీయ కార్మిక సంఘాల ఐక్యవేదిక సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించి తీర్మానం చేశామని తెలిపారు. వాటిలో ప్రధానంగా కార్మిక చట్టాల రక్షణ, కనీస వేతనాలు రూ.26 వేలు పెంపు, ఉద్యోగ భద్రత, ఉపాధి హక్కుల సాధనకై దేశ రక్షణకై సింగరేణిలో కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై జరుగుతున్న సార్వత్రిక దేశవ్యాప్త సమ్మె అని పేర్కొన్నారు. జూలై 1 నుంచి 7వ తేదీ వరకు అన్ని డివిజన్లలో గేట్‌మీటింగ్‌లు, ప్రచారం చేయాలని కోరారు.

రేపు సీపీఐ మహాసభ

జూలూరుపాడు: ఈనెల 21న జూలూరుపాడులో జరగనున్న సీపీఐ 13వ మండల మహాసభను జయప్రదం చేయాలని పార్టీ మండల కార్యదర్శి గుండెపిన్ని వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. గురువారం జూలూరుపాడులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పేదలు, కష్టజీవులు, కార్మికుల పార్టీ సీపీఐ అని అన్నారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు, సానుభూతిపరులు, అన్నివర్గాల ప్రజలు పెద్ద ఎత్తున సభకు తరలిరావాలని కోరారు. ఎస్కే చాంద్‌పాషా, కంచర్ల రాఘవేంద్రరావు, నిమ్మటూరి లచ్చయ్య, మహేష్ పాల్గొన్నారు.

‘ప్రైవేట్’లో ఫీజు దోపిడీని అరికట్టాలి

ఇల్లెందు: అత్యధికంగా గిరిజనులు, ఆదివాసీలున్న ఇల్లెందు ఏరియాలో పలు ప్రైవేట్ పాఠశాలలు ఇష్టారాజ్యంగా ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నాయి. తక్షణం ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో చర్చించి ఫీజుల దోపిడీని అరికట్టాలని ఇల్లెందు పట్టణ, మండల యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ కోరింది. ఈ మేరకు గురువారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించి ఎమ్మెల్యే కోరం కనకయ్యకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో చర్చించి ఫీజులు తగ్గించేలా కృషి చేస్తానని, ఈ విషయం జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. పూనెం మధు, ఈసం లక్ష్మణ్, రాజేష్, వీర నాయుడు, సాగర్, ప్రసాద్, శివ, అనిల్, నరేష్ పాల్గొన్నారు.

లక్ష్యసాధనకు కృషి చేయాలి


గని అధికారికి వినతిపత్రం అందజేస్తున్న బీసీ, ఓబీసీ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): కంపెనీ నిర్దేశించిన లక్ష్యసాధనకు ప్రతీఒక్కరు కృషి చేయాలని బీసీ, ఓబీసీ అసోసియేషన్ అధ్యక్షుడు అమిరిశెట్టి నాగేశ్వరరావు అన్నారు. గురువారం టీ సమయంలో బీసీ, ఓబీసీ నాయకులు పీవీకే –5 ఇంక్‌లైన్ గని మేనేజర్ శ్యాం ప్రసాద్‌ను కలిసి, బీసీల సమస్యలను వివరించి సమస్యలపై వినతిపత్రాన్ని గని మేనేజర్‌కు అందజేశారు. మాట్లాడుతూ.. భూగర్భగనుల్లో ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించేందుకు యాజమాన్యం చేస్తున్న ప్రయత్నంలో మనం భాగస్వాములం కావాలన్నారు. అదేవిధంగా అందరూ రక్షణ సూత్రాలను పాటించి జీరో ప్రమాదాల కంపెనీగా సింగరేణికి పేరు తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో నల్లపురి రమేష్, నరేంద్రబాబు, వి.వెంకటేశ్వర్లు, ఎస్.నాగేశ్వరరావు, విజయగిరి శ్రీనివాస్‌రావు, ఈశ్వరయ్య, ఎం.రామకృష్ణ, మహేష్, సాంబమూర్తి, కూసన నరేందర్, కమల్, శంకర్, వి.సాంబమూర్తి, ఎస్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హామీని నిలబెట్టుకోండి..

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఏజెన్సీ ప్రాంతం ఎస్సీ కులాల అభివృద్ధి సంక్షోభంలో పడిందని కాంగ్రెస్ ప్రభుత్వం అదుకోవాలని షెడ్యూల్డ్ హక్కుల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మెర శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో కోరారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల ముందు రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడి హోదాలో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డిని తన నివాసం కలిసి వినతిపత్రం అందజేసి ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాల స్థానిక జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల రిజర్వేషన్ జనరల్‌లో కలపడం వలన ఏజెన్సీ ప్రాంతంలో లక్షలాది మంది ఎస్సీ కులాలకు రాజకీయ ప్రాతినిధ్యం లేకుండా అన్యాయం జరిగిందని విన్నవించడం జరిగిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, కాంగ్రెస్ ప్రభుత్వం గెలుపు కోసం ఎంతో కృషి చేసినట్లు కూడా వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నందున ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాలకు ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలని, 2014 స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ ఆధారంగా అమలు చేయాలని కోరారు. ఏజెన్సీ ప్రాంత ఎస్సీ కులాల అభివృద్ధిపై అణచివేత జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు

ఏఐసీసీ నాయకుడు రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను గురువారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వాస్పత్రుల్లో పాలు, పండ్లు పంపిణీ చేశారు. మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ నేతృత్వంలో దేశం, రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కార్యకర్తలు, అభిమానులు కృషి చేయాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్


ఇల్లెందు: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కనకయ్య



కొత్తగూడెంఅర్బన్: కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, పాల్వంచలో..


చుంచుపల్లి: విద్యానగర్‌లో రాహుల్ గాంధీ జన్మదిన వేడుకల్లో నాయకులు

కాంగ్రెస్ శ్రేణులు సమాయత్తం కావాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు: ఇల్లెందులో ఈనెల 21వ తేదీన కాంగ్రెస్ ఆధ్వర్యాన బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కోరం కనకయ్య తెలిపారు. ఇల్లెందులోని క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన నియోజకవర్గ ముఖ్య కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక భూభారతి చట్టాన్ని తీసుకురావడమే కాక రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు, గ్యాస్ సబ్సిడీ, ధాన్యానికి బోనస్ చెల్లిస్తున్నామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్నందున అత్యధిక స్థానాలను గెలిచేలా సభ నిర్వహిస్తున్నామని, ఈ సభలో కాంగ్రెస్ పథకాలను వివరిస్తూ ఎన్నికలకు పార్టీ శ్రేణులకు సమాయాత్తం చేస్తామని చెప్పారు. ఈనెల 21న శనివారం సాయంత్రం 4 గంటలకు సింగరేణి స్కూల్ గ్రౌండ్‌లో జరిగే సభలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొననున్నందున జన సమీకరణపై దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో డానియేల్, పులి సైదులు, ధనియాకుల రామారావు, కంభాల ముసలయ్య, గింజల నర్సిరెడ్డి, దేవానాయక్, మూల మధుకర్‌రెడ్డి, మేకల మల్లిబాబు యాదవ్ పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కండి..

పాల్వంచ: రాష్ట్రంలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక అయ్యప్పనగర్‌లోని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయంలో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందన్నారు. రైతుల కోసం రూ.2లక్షల రుణమాఫీ, రైతు భరోసా ఎకరానికి రూ.12వేలు, రైతు బీమా, మహిళలకు ఉచిత బస్సు, సన్నబియ్యం, సబ్సిడీపై వంట గ్యాస్, 200యూనిట్ల ఉచిత కరెంట్ వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కొండం వెంకన్న, ఎస్ఏ.జలీల్, బాలినేని నాగేశ్వరరావు, మహిపతి రామలింగం, బాదర్ల జోషి, సాధం రామకృష్ణ, బద్ది కిషోర్, అచార్యులు, వెంకటాచారి, చింతానాగరాజు, ప్రభాకర్, మధుసూదన్‌రావు, సుందర్ రావు, బాషా, నాగేశ్వరరావు, చాంద్ పాషా, చిరంజీవి, కోటి నాయక్, రోశయ్య, బాలాజీ నాయక్, నాగరాజు, గోపి, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

పెంచిన చార్జీలను ఉపసంహరించుకోవాలి


దేవేందర్‌గౌడ్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

చుంచుపల్లి: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన ఆర్టీసీ బస్సు పాస్ చార్జీలను వెంటనే ఉపసంహరించుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. అనంతరం డిపో మేనేజర్ దేవేందర్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రణయ్ కుమార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో విద్యారంగానికి అనేక హామీలు ఇచ్చిందన్నారు. హామీలు నెరవేర్చకుండా కొత్తగా బస్సుపాస్ చార్జీలను పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. 20 కిలోమీటర్ల పరిధిలో రూ.400 బస్సు పాస్ చార్జ్ ఉంటే ఇప్పుడు రూ.600 వరకు చేరుకుందని చెప్పారు. ముఖ్యంగా ఏజెన్సీలో ఎక్కువ మంది విద్యార్థులు రోజువారి ప్రభుత్వ రవాణా వ్యవస్థను వినియోగిస్తున్నారని, దీనివల్ల విద్యార్థులపై భారం పడటమే గాక ఏజెన్సీ ప్రాంత విద్యార్థులు చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. అటు స్కాలర్‌షిప్, రీయింబర్స్‌మెంట్ రాక విద్యార్థులు ఇప్పటికే అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పి.వెంకటేష్, కిరణ్, వీరన్న, పవన్, నవీన్, చరణ్, వివేక్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనత నిర్మూలనే లక్ష్యం


టేకులపల్లి: సులానగర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ

టేకులపల్లి: 2047 సంవత్సరానికల్లా ప్రజలకు రక్తహీనత లేకుండా చేసేందుకు ప్రతీఒక్కరు ఈ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలని సులానగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి కందుల దినేష్ అన్నారు. ఈమేరకు గురువారం సులానగర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ముత్యాలంపాడు క్రాస్‌రోడ్‌లో సికిల్ సెల్‌పై వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. మాట్లాడుతూ.. తల్లిదండ్రుల నుంచి వంశపారంపర్యంగా, జన్యుపరంగా ఈ వ్యాధి సంక్రమిస్తుందన్నారు. దీనివలన జాయింట్ పెయిన్స్, ఛాతి, కడుపులో నొప్పి, అరచేతులు, పాదాలు వాపు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, చిన్నచిన్న పనులకే అలసిపోవడం, నీరసం వంటి ఆరోగ్య సమస్యలు ఉంటాయని తెలిపారు. 2047 సంవత్సరం కల్లా ఈ వ్యాధి లేని సమాజం కొరకు వివాహానికి ముందే సికిల్ సెల్ స్క్రీనింగ్ పరీక్షలు విధిగా చేయించుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆస్పత్రులలో, ఆరోగ్య ఉపకేంద్రాలలో ఉచితంగా సికెల్సెల్ ఎనీమియా స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నామని తెలిపారు. డాక్టర్ కంచర్ల వెంకటేష్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి, నర్సింగ్ ఆఫీసర్ జగదాంబ, పబ్లిక్ హెల్త్ నర్సాఫీసర్ చంద్రకళ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

జూలూరుపాడు: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి భేతాళపాడు, కొమ్ముగూడెం, అన్నారుపాడు ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ (పల్లె దవాఖానా)లలో గురువారం ప్రపంచ సికిల్‌సెల్ నివారణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బంది సికిల్ సెల్ అనీమియా వ్యాధి లక్షణాలు, నివారణ, జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎస్ రత్నకుమార్, ఫార్మసిస్ట్ తులసీరామ్, ఏఎన్ఎంలు ఝాన్సీరాణి, రీనా, సుజాత, ఆదిలక్ష్మి, నాగలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

‘బుగ్గవాగు’ పనులు సాగేనా..?

రూ.9 కోట్లు మంజూరు

- మే నెలాఖరు నుంచి మొదలైన పనులు
- కాలం మీదికొచ్చినా పెరగని వేగం
- అగమ్యగోచరంగా సుందరీకరణ


బుగ్గవాగు ప్రక్షాళన పనుల్లో ఒకవైపు రిటైనింగ్ వాల్ నిర్మాణం


సత్యనారాయణపురం లోలెవల్ కాజ్‌వే వద్ద పూడిక తొలగించిన దృశ్యం

ఇల్లెందు: ఇల్లెందు పట్టణానికి పొంచి ఉన్న బుగ్గవాగు ప్రక్షాళన – సుందరీకరణ పనులు ప్రారంభం అయ్యే నాటికి వర్షాకాలం రానే వచ్చేసింది. టీయూఎఫ్ఐడీసీ, డీఎంఎఫ్ నిధులు రూ. 9 కోట్ల నిధులతో మే నెలాఖరులో బుగ్గవాగు సుందరీకరణ పనులు మొదలు పెట్టారు. గత జనవరి నెలలో శంకుస్థాపన జరిగితే మే నెలాఖరున పనులు ప్రారంభం అయ్యాయి. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ మూడు నెలల్లో పూర్తి కావాల్సిన కాలంలో పనులు ప్రారంభించకుండా వర్షాలు కురిసే సమయానికి పనులు మొదలు పెట్టిన తీరుతో బుగ్గవాగు సుందరీకరణ పనులు అగమ్యగోచరంగా ఉన్నాయి. జనవరి 22న రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన జరిగింది.

ఏటా వర్షాకాలంలో గండమే..

ఏటా వర్షాకాలం వచ్చిందంటే బుగ్గవాగుతో గండం పొంచి ఉన్నట్లే.. వాగు పూడిక తీయకపోతే వరద ఇళ్లల్లోకి వస్తుంది. దీంతో బుగ్గవాగు ప్రక్షాళన కోసం రూ.9 కోట్ల మంజూరు చేశారు. ఈ నిధులతో వాగు వెంట ఇరువైపులా రిటైనింగ్ వాల్ నిర్మాణం చేయాల్సి ఉంది. ఇరువైపులా వాకింగ్ ట్రాక్‌లు వాగులో చెత్తచెదారం వేయకుండా ఫెన్సింగ్ నిర్మాణం కూడా చేయాల్సి ఉంది. ఫిబ్రవరిలో పనులు మొదలై ఉంటే జూన్– జూలై వరకు పూర్తయ్యే అవకాశం ఉండేది. పట్టణం మధ్య నుంచి ప్రవహించే బుగ్గవాగుకు ఇరువైపులా ఆక్రమణలు ఉన్నాయి. ఎంతోమంది వాగులోకి ఇళ్ల వచ్చి నిర్మాణాలు చేసుకున్నారు. ఇక ఇళ్లు, షాపులలో వచ్చే చెత్తను వాగులో వేస్తున్నారు. దీంతో వాగు నిండా పూడిక పేరుకుపోతోంది. అధిక వర్షాలకు వరద ఉధృతికి వాగు పొంగి లోతట్టు ప్రాంతాలు మునిగిపోతున్నాయి. బుగ్గవాగు మీద రెండు చోట్ల లోలెవల్ కాజ్‌వేలు ఉన్నాయి. వాగు పొంగితే కాజ్‌వేల పైనుంచి వరద ప్రవహిస్తుంది. చెత్తచెదారం కాజ్‌వే ఖానాలకు అడ్డుపడు నీరు పోటు కొడుతుంది. లోతట్టు ప్రాంతాలు జలమయంగా మారుతుంటాయి. ఒకవైపు బుగ్గవాగు, అలుగు వాగుల వల్ల అటు సత్యనారాయణపురం, ఇటు ఇల్లెందులపాడు ప్రజలకు వరద పోటు తప్పటం లేదు. పట్టణం మధ్య నుంచి అంటే హిందూ శ్మశాన వాటిక నుంచి స్టేషన్ బస్తీ ముగింపు వరకు కిలోమీటరు దూరం ఈ వాగు ఉంటుంది. నంబర్–2 బస్తీ, ఎల్‌బీఎస్ నగర్, స్టేషన్ బస్తీలకు ముప్పు ఉంటుంది. 15 రోజులుగా పనులు ముమ్మరం అయ్యాయి. కానీ వర్షాలు కురిస్తే వాగులో పనులు నిలిచిపోతాయి. పనులు సాగుతున్న వాగులో వాహనాలు వెళ్లేందుకు కంకర, సిమెంటు, ఇసుక తరలించేందుకు తయారు చేసిన రహదారి కొట్టుకుపోయ్యే పరిస్థితి ఉంది.

చెత్త తొలగింపు..

బుగ్గవాగు వల్ల పట్టణానికి ప్రమాదం ఏర్పడకుండా లోలెవల్ కాజ్‌వేల వద్ద పేరుకుపోయిన పూడిక తొలగిస్తున్నారు. వారం రోజులుగా మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ అధికారులు బుగ్గవాగు మీద బర్లపెంట, ఎల్‌బీఎస్ నగర్, సత్యనారాయణపురం రోడ్డులోని లోలెవల్ కాజ్‌వేల వద్ద పూడిక తొలగిస్తున్నారు. అకస్మాత్తుగా వర్షాలు వస్తే చెత్తంతా కాజ్‌వేల వద్ద చిక్కి నీరు వెళ్లకుండా అడ్డుపడుతుంది.

ఓ వైపు పూర్తవుతుంది..



బుగ్గవాగు బ్రిడ్జి నుంచి ఇరువైపుల వాగులో సగం రిటైనింగ్ వాల్ నిర్మాణం చేసేందుకు నిధులు మంజూరయ్యాయి. గత నెలాఖరున పనులు ప్రారంభించాము. వర్షాలు వచ్చేలోపు ఒకవైపు వాల్ నిర్మాణం పూర్తవుతుంది. మిగిలిన మూడు వైపులా వర్షాకాలం తర్వాత పనులు చేయటం జరుగుతుంది.

– జి.రాజు, పంచాయతీరాజ్ ఏఈ

పూడిక తొలగిస్తున్నాం..



బుగ్గవాగు ప్రక్షాళన పనులు వచ్చే వర్షాకాలం లోపు పూర్తి కావు. దీంతో వాగు పొంగితే ప్రమాదం ఉందని ముందే గ్రహించిన వాగు మీద లోలెవల్ కాజ్‌వేలు, చెత్తచెదారం అత్యధికంగా ఉన్నచోట పూడిక తీసి వాగును శుభ్రం చేయిస్తున్నాము. ప్రమాద లేకుండా చర్యలు తీసుకుంటున్నాము.

– సీహెచ్ శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్